

ఇల్లూరు గ్రామం పెన్నానదిలో ఎక్స్‌కవేటర్లు ఉన్న దృశ్యం

ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY



అధికార నేత అండతో..
రాత్రంతా ఇసుక అక్రమ రవాణా

● పట్టించుకోని అధికారులు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 6: జమ్మలమడుగు నియోజకవర్గంలో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి అండతో చీకటి పడితే చాలు.. నదిలో ఇసుకను తోడేసి టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు.



ఇల్లూరు గ్రామ శివార్లలో టిప్పర్ల వేగానికి దెబ్బతిన్న రోడ్డు

ఎర్రగుంట్ల మండలం ఇల్లూరు గ్రామం వద్ద పెన్నానది నుంచి నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధికి సంబంధించిన టిప్పర్లతో, చుట్టుపక్కల ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. దీనికి అధికారులే అండ ఉన్నట్లుగా ఇల్లూరు గ్రామ ప్రజలు సచివాలయం ఎదురుగా బహిరంగ విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికే పెన్నానదిలో ఇసుక ఖాళీ అయిపోవడంతో ఇక్కడ పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయని అంటున్నారు.



పెన్నానది నుంచి ఇల్లూరు సచివాలయం ఎదురుగా రాత్రి సమయాల్లో టిప్పర్లు తరలి వెళ్లే దారి

ఎక్సకవేటర్లతో..

ఇల్లూరు గ్రామం వద్ద పెన్నానదిలో నుంచి ప్రతిరోజు రాత్రి సమయాల్లో ఇసుకను ఎక్స్‌కవేటర్ల ద్వారా తోడి టిప్పర్లకు, ట్రాక్టర్లకు నింపుకుని సుదూర ప్రాంతాలకు తరలిస్తున్నారని అంటున్నారు. వచ్చే ఎన్నికల్లో డబ్బుకోసమే అధికార పార్టీకి చెందిన నేతలు ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి రోజు రాత్రి సమయంలో 50 నుంచి 80 టిప్పర్లకు, వందకు పైగా ట్రాక్టర్లకు ఎక్స్‌కవేటర్ల ద్వారా పెన్నానదిలో ఇసుక నింపుతున్నారు. ట్రాక్టర్ల ద్వారా ఇసుకను ఇల్లూరు గ్రామం, సోములవారిపల్లె, జగన్న కాలనీ నుంచి రామేశ్వరం బైపాస్ రోడ్డు గుండా బయటి ప్రాంతాలకు తరలిస్తున్నారు. టిప్పర్ల ద్వారా ఆళ్లగడ్డ, బనగానపల్లె, కర్నూలు, హైదరాబాదు తదితర ప్రాంతాలకు తరలించి ఇసుకను అమ్ముకుంటున్నారు. సుమారు 25 రోజుల నుంచి దాదాపు టిప్పర్ల ద్వారానే ఇసుక తరలిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.

పకడ్బందీ ఏర్పాట్లు..

పెన్నానది నుంచి ఇసుక అక్రమ రవాణాకు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. నదిలోకి ఎవరైనా కొత్త వ్యక్తి వచ్చినా గుర్తించి అడ్డుకునేందుకు ఇద్దరి నుంచి ముగ్గురిని అక్కడ నిత్యం కాపలా ఉంచుతున్నారని అంటున్నారు. ఇక వంకకు పక్కనే ఇసుకకు రశీదులు ఇచ్చేందుకు చిన్న తడికెలతో పందిరి వేసుకున్నారు. ఇక్కడి నుంచి కొత్తవాళ్లు ఎవ్వరూ పెన్నానదిలోకి వెళ్లకుండా కాపలా కాస్తుంటారు.

నదిలోనే ఎక్సకవేటర్లను ఉంచి..

సోమవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో ఇల్లూరు గ్రామ శివార్లలో రోడ్డు పక్కన ఎవరో అధికారులు వచ్చి తనిఖీ చేసి రెండు టిప్పర్లకు జరిమానా వేసి వెళ్లారని, అయినా రాత్రంతా టిప్పర్లు తిరిగాయని గ్రామంలోని ప్రధాన సెంటరులో స్థానికులు తెలిపారు. ఉదయం ఎక్స్‌కవేటర్లను పెన్నానదిలోనే ఉంచి మళ్లీ రాత్రికి ఇసుకను తరలించేందుకు సంబంధిత నాయకులు, అధికారులతో చర్చించినట్లుగా సమాచారం.

అధికారులు ఏమన్నారంటే..

ఇసుక రవాణాకు సంబంధించి అనుమతులు ఉన్నాయా అని స్థానిక సచివాలయం పంచాయతీ సెక్రటరీని, రెవెన్యూ వీఆర్వోను ఆంధ్రజ్యోతి అడుగగా తమకేమి తెలియదన్నారు. అయితే ఇసుక టిప్పర్లు తాము ఉదయం విధులకు వచ్చినప్పుడు వెళుతూనే ఉంటాయని తెలిపారు. అలాగే ఎర్రగుంట్ల తహసీల్దారు సౌజన్యను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా తాను కొత్తగా వచ్చానన్నారు. ఇల్లూరు గ్రామంలోని పెన్నానదిలో ఇసుక తరలిపోతోందని అందుకు సంబంధించిన వీఆర్వో సెలవుపై ఉన్నాడని బుధవారం నుంచి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏది ఏమైనా అక్రమంగా తరలిపోతున్న ఇసుకకు సంబంధిత అధికారుల నుంచి అనుమతులు తెచ్చుకుంటారో లేక అధికారుల అండతోనే తరలిస్తారో అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తారో లేదో వేచి చూడాల్సి ఉంది.

అంతా మాయ

● తప్పుల తడకగా ఓటర్ల జాబితా

● చనిపోయిన వారి ఓట్లను తొలగించని వైనం


● నివాసం ఉండేది ఒక చోట.. ఓటు మరో చోట

● ఖాళీ స్థలం చూపించి ఓటు నమోదు

● వైసీపీ తొత్తులుగా అధికారులు



ఆర్కే నగర్‌లో ఈ స్థలంలో ఇల్లు ఉందంటూ 42 ఓట్లు నమోదు చేశారు



(కడప-ఆంధ్రజ్యోతి): వైసీపీ వచ్చే ఎన్నికల్లో మేమే మళ్లీ గెలుస్తామంటూ గొప్పలు చెబుతోంది. నాలుగు న్నరేళ్ల అభివృద్ధి గాలికొదిలేసిన వైసీపీ వచ్చే ఎన్నికల్లో అడ్డగోలుగా గెలవాలన్నదే లక్ష్యంగా పెట్టు కున్నట్లు స్పష్టమవుతోంది. ఎందుకంటే చనిపోయిన వారి ఓట్లను తొలగించకుండా ఉన్న ఓటర్లనే వేరే చోటకి తరలించడం, ఊరు పేరు లేని చోట కొత్త ఓటర్లను నమోదు చేయడం దీనికి బలం చేకూరుస్తోంది. అయితే.. తుదిఓటర్ల జాబితాను చూసిన తరువాత పుట్టలోని పాముల్లా నకిలీ ఓటర్ల జాబితా బయటికి వస్తోంది.

ఓటరు జాబితా చేర్పులు మార్పులపై ఎన్నికల సంఘం ఏమైతే అవకాశమిచ్చిందో వాటన్నింటినీ టీడీపీ సద్వినియోగం చేసుకుంటూ అభ్యంతరాలు తెలుపుతూ ఆధారాలతో సహా ఫిర్యాదు చేసింది. అయినా ఓటర్ల తుదిజాబితాలోనూ అవే తప్పులు అలానే ఉన్నాయి. దీన్ని బట్టి చూస్తే అక్రమ ఓట్ల పేరిట అడ్డంగా గెలవాలన్నది వైసీపీ ముఖ్య ఉద్దేశ్యంగా కనిపిస్తోందని ప్రతిపక్షాలు అంటు న్నాయి. జిల్లా వ్యాప్తంగా ప్రతి చోటా చనిపోయిన వారి పేర్లు, లేని ఓట్లు, అసలు లేని వారి ఓట్లను చూపిస్తూ మాయకు తెరలేపడం ఇప్పుడు బాగా చర్చనీయాంశంగా మారింది.

గైడ్‌లైన్స్ బుట్టదాఖలు

ఓటరు లిస్టులో అక్రమాలపై ఇతరత్రా వాటికి కేంద్ర ఎన్నికల సంఘం అవకాశమిచ్చింది. కొత్త ఓటు నమోదుతో పాటు చనిపోయిన వారి ఓట్లను తొలగించడం, ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓట్లను తీసివేయడం, అర్హులైన వారికి ఓటు హక్కు కల్పించడమే ప్రధాన ఉద్దేశ్యం. ఫిర్యాదు చేసిన వెంటనే బీఎల్‌వోలు ఇతరత్రా అధికారులు ఎన్నికల కమిషన్ గైడ్‌లెన్స్ ప్రకారం పనిచేయాల్సి ఉంది. అయితే తుది ఓటర్ల జాబితా పరిశీలిస్తే ఆరోపణలన్నీ బుట్టదాఖలు చేసి వైసీపీకి ఫేవర్‌గా వ్యవహరించినట్లు తెలిసింది. కడప నియోజకవర్గంలోనే చనిపోయిన వారు, డబుల్ ఎంట్రీ, లేనివారి ఓట్లు సుమారు 20వేలకు పైగా ఉన్నాయని చెబుతారు. ఆధారాలతో సహా అధికారులకు ఇచ్చినా ఆ ఓట్లను తొలగించకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఈ యంత్రాంగమంతా వైసీపీ కనుసన్నల్లో పనిచేస్తోందనే విమర్శకు బలం చేకూరుస్తోంది.

ఓటర్ల లిస్టు అక్రమాలపై కొన్నింటిని పరిశీలిస్తే..

● కడపలోని ఆర్కేనగర్‌లో బూత్ నెం.203లో సర్వే నెంబర్ 340 పేరిట 42 మంది ఓటర్లను నమోదు చేశారు. వాస్తవానికి అది ఇంటి నెంబరు కాదు. అదొక ఖాళీ స్థలం. కడప - తిరుపతి బైపాస్ రోడ్డు కావడం గమనార్హం. ఓటు హక్కు నమోదు చేయాలంటే సవాలక్ష ప్రశ్నలు అడిగే అధికారులు ఖాళీ స్థలం పెట్టి 42 ఓట్లు అప్లై చేసినా గుడ్డిగా యాక్సెప్ట్ చేశారు. దీన్ని బట్టి చూస్తే అక్కడున్న సచివాలయం వలంటీర్లు వైసీపీకి ఎంత భజన చేస్తున్నారో అర్థమవుతుంది.

● 44వ డివిజన్‌లో ఉన్న ఓటర్లను వేరే డివిజన్‌కు బదిలీ చేశారు. ఒకే కుటుంబంలో ఉన్న ఓట్లను సేమ్ పోలింగ్ బూత్‌లో కాకుండా వేరే చోటకు మార్చివేశారు. వైసీపీ ప్రభుత్వ వ్యతిరేక ఓటర్లను మాత్రమే ఇలా అడ్డగోలుగా మార్చినట్లు చెబుతారు.



ఒంటిమిట్టలో చనిపోయిన వారు ఓటరు లిస్టులో ఉన్న దృశ్యం



చాపాడు మండలంలోని విశ్వనాథపురంలో స్థానికంగా లేనివారికి ఓటు హక్కు కల్పించారు. పై ఫొటోలో కనిపిస్తున్న వారంతా స్థానికులు కాదు.



వీరంతా ఓటర్లేనంట

చెలరేగిపోయిన స్మగ్లర్లు

● కేవీపల్లె మండలంలో దారుణం

● కారుతో ఢీకొట్టి పోలీసు కానిస్టేబుల్ హత్య

● మృతుడిది శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం

● గణేశ్ కుటుంబానికి రూ.30 లక్షల ఎక్స్‌గ్రేషియా : ఎస్పీ



పోలీసుల అదుపులో స్మగ్లర్లు



గణేశ్ మృతదేహం

పీలేరు, ఫిబ్రవరి 6: ఇంతకాలం దొంగ దారుల్లో స్మగ్లింగ్ చేస్తూ వచ్చిన ఎర్రచందనం స్మగ్లర్లు మంగళవారం ఉదయం చెలరేగిపోయారు. తమ అక్రమ రవాణాను అడ్డుకోబోయిన ఓ పోలీసు కానిస్టేబుల్‌ను దారుణంగా, విచక్షణా రహితంగా కారుతో గుద్ది హత్య చేశారు. ఈ సంఘటన మంగళవారం తెల్లవారుజామున కేవీపల్లె మండలం గుండ్రేవారిపల్లె సమీపంలోని గొల్లపల్లె చెరువు వద్ద జరిగింది. పోలీసుల కథనం మేరకు...

సుండుపల్లె, సానిపాయ అటవీ ప్రాంతం నుంచి స్మగ్లర్లు ఎర్రచందనం చెట్లను నరికి దుంగలుగా మలచి సుండుపల్లె, పీలేరు మీదుగా చెన్నై తరలిస్తున్నారు. ఇటీవలి కాలంలో స్మగ్లర్ల కదలికలపై పోలీసులు, ఫారెస్టు సిబ్బంది నిఘా పెంచారు. ఎక్కడికక్కడ స్మగ్లింగ్‌ను అడ్డుకుంటూ అక్రమ రవాణాకు చెక్ పెడుతున్నారు. ఈ నేపథ్యంలో సానిపాయ అటవీ ప్రాంతం నుంచి ఎర్రచందనం స్మగ్లింగ్ జరుగుతోందన్న సమాచారం రావడంతో ఆర్ఎస్ఐ విశ్వనాథ్ నేతృత్వంలోని ఏడుగురు కానిస్టేబుళ్లతో కూడిన టాస్క్‌ఫోర్స్ బృందం సోమవారం రాత్రి కేవీపల్లె-సుండుపల్లె మండలాల సరిహద్దు ప్రాంతమైన ఎంవీ పల్లె పంచాయతీలోని గొల్లపల్లె చెరువు వద్ద వాహనాల తనిఖీ చేపట్టింది. మంగళవారం తెల్లవారుజామున 2.30 గంటల ప్రాంతంలో గంటల ప్రాంతంలో సుండుపల్లె వైపు నుంచి వేగంగా వస్తున్న మారుతీ స్విఫ్ట్ కారును టాస్క్‌ఫోర్స్ బృందం ఆపింది. పోలీసులు వాహనాలను ఆపినప్పుడు సహజంగా ఎర్రచందనం స్మగ్లర్లు తమ వాహనాలను ఆపి పారిపోవడమో లేక వేగంగా ముందుకు దూసుకెళ్లిపోవడమో చేస్తుంటారు. అయితే స్మగ్లర్లు దీనికి భిన్నంగా వ్యవహరించారు. వాహనాల తనిఖీలు గమనించిన స్మగ్లర్లు తమ కారుకు ఎదురుగా ఉన్న టాస్క్‌ఫోర్స్ బృందంలోని గణేశ్ (30)ను గుద్దుకుంటూ ముందుకు పోనిచ్చారు. దీంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు వెంబడించడంతో స్మగ్లర్లు సంఘటనా స్థలం నుంచి కాసింత దూరం వెళ్లి కారును వదిలేసి ముగ్గురు పారిపోగా ఇద్దరు పోలీసులకు పట్టుబడ్డారు. గణేశ్‌ను చికిత్స కోసం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే అతను ప్రాణాలు వదిలాడు.

గణేశ్ మృతి చెందిన విషయం తెలుసుకున్న అతడి భార్యాపిల్లలు, బంధువుల మంగళవారం ఉదయం పీలేరు ఆసుపత్రికి చేరుకున్నారు. 'నాకేమీ కాదు, నేను బాగానే ఉన్నాను, తెల్లారగానే ఇంటికి వచ్చేస్తానని చెబితివి కదా, మేమంతా వచ్చాం, లే గణేశ్' అంటూ అతడి భార్య పెట్టిన ఆర్తనాదాలు అక్కడున్న వారందరి కళ్లల్లో నీళ్లు తెప్పించాయి. జరిగిన అనర్థం అర్థం కాక అతడి పిల్లలు నిస్తేజంగా పడుకుని ఉన్న తండ్రిని, కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తల్లిని అమాయకంగా చూడడం అందరినీ కలిచి వేసింది. ఈ సంఘటన సమాచారం అందుకున్న అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావు, తిరుపతి ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. గణేశ్ మృతదేహానికి అనంతపురం ఏపీఎస్పీ 14వ బెటాలియన్ డీఐజీ సీహెచ్ వెంకటేశ్వర్లు, అంతేకాకుండా టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్న స్మగ్లర్లను విచారించారు. గణేశ్ కుటుంబానికి ప్రభుత్వం రూ.30 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిందని ఎస్పీ కృష్ణారావు తెలిపారు. అటవీ ప్రాంతాల్లో తమిళనాడుకు చెందిన స్మగ్లర్లు ప్రాణాంతక దాడులు చేయగలరని తాము అంచనా వేసుకున్నప్పటికీ మైదాన ప్రాంతాల్లో, అదీ పోలీసులపై ఘాతుకానికి పాల్పడగలరని ఊహించలేకపోయామని జిల్లా ఫారెస్టు అధికారి వివేక్ ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా ఏ విధమైన చర్యలు తీసుకోవాలో క్షుణ్ణంగా అధ్యయనం చేస్తామన్నారు.

బాధితులకే నోటీసులు

● ఇదీ కర్ణాటక పోలీసుల తీరు

● ఎస్పీని ఆశ్రయించిన బాధితులు



ఎస్పీకి ఫిర్యాదు ఇచ్చిన బాధితులు

మైదుకూరు, ఫిబ్రవరి 6: పదినెలల్లోనే రెట్టింపు డబ్బులిస్తామంటూ దాదాపు రూ.100 కోట్లు వసూలు చేసి బాధితులను మోసం చేసిన కర్ణాటకకు చెందిన కంపెనీ ఇప్పుడు హైడ్రామా నడుపుతోంది. మోసపోయిన బాధితులపైనే సెటిల్‌మెంట్‌కు వస్తారా లేకపోతే చంపుతామంటూ బెదిరింపులకు పాల్పడుతుండటంతో బాధితులు ఆందోళన చెందుతున్నారు. బాధితుల కథనం మేరకు..

బెంగళూరుకు చెందిన ఓ కంపెనీ నిర్వాహకులు ఉమ్మడి కడప జిల్లాలో పది నెలల్లో రెట్టింపు డబ్బులిస్తామంటూ నమ్మబలికి చాలా మందితో డిపాజిట్లు కట్టించుకుని దాదాపు రూ.100 కోట్లతో ఉడాయించడంపై మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీంతో సెటిల్‌మెంట్ బ్యాచ్ రంగంలోకి దిగింది. మంగళవారం ఈ బ్యాచ్ పోలీసులతో కలసి పోట్లదుర్తికి చెందిన ఒక బాధితుడిని కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించింది. కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించడం వారు వెంటనే రావడంతో సెటిల్‌మెంట్ బ్యాచ్‌లోని ఇద్దరు తాము కర్ణాటక పోలీసులమని కంపెనీ నిర్వాహకుల విచారణ నిమిత్తం నోటీసు ఇచ్చేందుకే వచ్చామంటూ అప్పటికప్పుడు నోటీసు మీద రాసి 7వ తేది లోపు స్టేషన్‌లో హాజరు కావాలంటూ నోటీసు ఇచ్చి వెళ్లారు. ఇలా మరి కొంత మందికి నోటీసులు ఇచ్చినట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో మోసపోయిన బాధితులు కొందరు మంగళవారం ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్‌కు ఫిర్యాదు చేశారు. కర్ణాటకకు చెందిన ట్రిబుల్ యస్. యస్ 5 యస్ సంస్థ నమ్మించి లక్షలాది రూపాయలు తీసుకొని మోసం చేసిందే కాక తమపై బెదిరింపులకు పాల్పడుతోందని, పోలీసులతో నోటీసులు ఇప్పిస్తున్నారని పేర్కొన్నారు. వారి నుంచి ప్రాణ భయం ఉందని తమకు రక్షణ కల్పించాలని వినతి పత్రం అందచేశారు.

మోసగించిందే కాక బెదిరింపులకు పాల్పడుతున్నారు

- శ్రీనివాసులరెడ్డి, బాధితుడు

మమ్మల్ని నమ్మించి మోసం చేసి డబ్బులు తీసుకున్నదే కాక ఇప్పుడు బయటకు చెబితే అంతుచూస్తామంటూ బెదిరిస్తున్నారు. కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. మోసపోయిన మాకే పోలీసులతో నోటీసులు ఇప్పించారు. మాకు రక్షణ కావాలి.



బాధితులకు కర్ణాటక పోలీసులు ఇచ్చిన నోటీసు

కనిపించని శత్రువు నులిపురుగు

● ఒక్కమాత్రతో దీనిని నులిమేద్దాం ● కలెక్టర్ విజయరామరాజు

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 6: కంటికి కనిపించని శత్రువు నులిపురుగు అని, ఇవి మనిషి రక్తం పీల్చి రక్తహీనతకు గురిచేస్తాయని కలెక్టర్ వి.విజయరామరాజు తెలిపారు. ఒక్క మాత్ర వేయడం ద్వారా నులి పురుగులను నులిమేసి పిల్లల ఆరోగ్యాలకు భరోసా కల్పించవచ్చన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంపై నగర కమిషనర్ ప్రవీణ్‌చంద్, డీఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ నాగరాజుతో కలసి జిల్లా వైద్య, అనుబంధ శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 9న జాతీయ నులిపురుగు నిర్మూలన కార్యక్రమం చేపడుతున్నామన్నారు. పిల్లల ఎదుగుదలకు అడ్డుకట్ట వేస్తున్న నులిపురుగుల నివారణే లక్ష్యంగా అన్ని అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయాలన్నారు. ఇందుకోసం వైద్య ఆరోగ్యశాఖాధికారులు, మున్సిపల్, పంచాయతీ, పట్టణ గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులను సమన్వయం చేసుకుంటూ అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఈనెల 9వ తేదీ నుంచి 16 వరకు అల్బెండజోల్ మాత్రలు 1-19 ఏళ్ల లోపు విద్యార్థులకు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని అందరూ విజయవంతం చేయాలన్నారు. అనంతరం రాష్ట్ర వైద్య మరియు ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ ప్రచురించిన వాల్‌పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆర్జేడీగా రాఘవరెడ్డి

● డీఈవోగా అనురాధ

కడప (ఎడ్యుకేషన్), జనవరి6: కడప రీజనల్ జాయింట్ డైరెక్టర్‌గా ఎద్దుల రాఘవరెడ్డికి పదోన్నతి కల్పిస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాశ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కడప డీఈఓగా విధులు నిర్వర్తిస్తున్న ఈయనకు ఆర్జేడీగా పదోన్నతి కల్పించారు. త్వరలో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. అలాగే.. డీఈఓగా ఎం.అనురాధకు పదోన్నతి కల్పిస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈమె నంద్యాల డీఈఓ కార్యాలయంలో ఏడీగా విధులు నిర్వర్తిస్తున్నారు. అలాగే కడప డీఈఓ కార్యాలయంలో ఏడీగా పనిచేస్తున్న చెప్పలి దేవరాజుకు చిత్తూరు డీఈఓగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించేది లేదు

● టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి

కడప(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 6: పదేళ్ల ఎమ్మెల్యేగా ఉన్నా అంజద్ బాషా కడప నగరానికి చేసింది శూన్యమని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. మంగళవారం కడప నగరం ద్వారకానగర్‌లోని తమ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ ఓటమి భయంతో టీడీపీ పోస్టర్లను చించి వేయించే స్థాయికి అంజద్‌బాషా దిగజారి పోయారన్నారు. 31వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి ఇంటికి ఉన్న స్టిక్కర్లను తొలగించే ప్రయత్నం చేయగా ఆయన తిరగబడితే వెనుదిరిగిన విషయం గుర్తు చేశారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా నగరానికి ఏం చేశారని అడిగితే మాపై విమర్శలు చేస్తున్నారన్నారు. రాజకీయంగా ఎన్ని విమర్శలైనా చేసుకోవచ్చుని, వ్యక్తిగతంగా విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు కొందరు వైసీపీ ఏజంట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. కడప నియోజకవర్గ ఇన్‌చార్జి ఆర్.మాధవీరెడ్డి మాట్లాడుతూ ఓటరు ఫైనల్ లిస్టులో డెత్‌లు, డబుల్ ఎంట్రీలు 20వేలకు పైగా ఉన్నాయన్నారు. 70వ బూత్‌లో 700 మంది దొంగ ఓటర్లను చేర్చారని అన్నారు. అధికారులు వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి

నిండా మునిగిన శనగ రైతు

- అనుకూలించని ప్రకృతి
- గణనీయంగా తగ్గిన దిగుబడి
- పెట్టుబడి కూడా రాలేదంటున్న రైతన్నలు
- కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరం
- ప్రభుత్వం ఆదుకోవాలంటూ వేడుకోలు

మైలవరం, ఫిబ్రవరి 6: శనగ పంట రైతన్నలను నట్టేట ముంచింది. వర్షాభావం, ప్రకృతి అనుకూలించకపోవడంతో పంట దిగుబడి గణనీయంగా తగ్గింది. పెట్టిన పెట్టుబడులు సైతం చేతికి అందక అన్నదా తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట సాగు చేసి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

జిల్లాలో ఈ ఏడాది శనగ విత్తనం సాగు చేసే సమయానికి వర్షాలు సరిగా పడకపోయినా.. ఎక్కడ అదును దాటిపోతుందోనని అరకొర



మైలవరంలో సాగు చేసిన శనగపంట

పదనుకే విత్తనం విత్తారు. గత ఏడాది 1.60 లక్షల ఎకరాలకు పైగా శనగ పంట సాగైతే.. లక్ష ఆరు వేల ఎకరాలలో మాత్రమే సాగైంది. అధికంగా మెట్ట ప్రాంతం, నల్లరేగడి ప్రాంతాల్లో పంట సాగు చేశారు. జిల్లాలో అధికంగా పెద్దముడియం మండలంలో 11,600 హెక్టార్లలో, కమలాపురంలో 4వేల హెక్టార్లు, రాజుపాలెం 3,900 హెక్టార్లు, జమ్మలమడుగులో 4 వేల హెక్టార్లు, సింహాద్రిపురం 3200 హెక్టార్లు, వీరపునాయునిపల్లె 2400 హెక్టార్లు, ఎర్రగుంట్ల 3300 హెక్టార్లు, మైలవరం మండలంలో 2200 హెక్టార్లలో అధికంగా శనగ పంట సాగు చేశారు. మైలవరం మండలంలోని చిన్నవెంతుర్ల, నవాబుపేట, కల్లుట్ల, బెస్తవేముల, వద్దిరాల, తలమంచిపట్నం తదితర గ్రామాలలో రైతులు పంట సాగు చేశారు. పంట సాగు చేసినప్పటి నుంచి వర్షాలు సక్రమంగా పడకపోవడం, ప్రకృతి అనుకూలించిక తెగుళ్లు ఆశించడంతో పంట సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు.

తీవ్రంగా నష్టపోయాం



నేను 8 ఎకరాలలో శనగ పంట సాగు చేశా. నా సొంత పొలం 4 ఎకరాలు ఉండగా, మరో 4 ఎకరాలు దాదాపు రూ.40 వేలకు కౌలుకు తీసుకుని సాగు చేశా. ఎకరాకు 1.50 క్వింటాళ్ల శనగలు అయ్యాయి. పంట కోత కోయడానికి ఎకరాకు రూ.1600.. నూర్పిడి యంత్రానికి ఎకరాకు రూ.1300 చెల్లిస్తున్నాం. వర్షాలు సమయానికి పడకపోవడంతో దిగుబడి గణనీయంగా తగ్గి తీవ్రంగా నష్టపోయాం.

\- మల్లయ్య, రైతు నవాబు పేట

పెట్టుబడి కూడా రాలేదు...

శనగ పంట సాగుకు ఎకరాకు రూ.13 నుంచి 16 వేల వరకు పెట్టుబడి పెట్టారు. శనగ విత్తనాలు, దుక్కులు, రసాయనిక ఎరువులు, పురుగు మందుల పిచికారి, శనగ నూర్పిళ్ల తదితర ఖర్చులు కలుపుకుని ఎకరాకు దాదాపు రూ.15వేల వరకు రైతులు పెట్టుబడులు పెట్టారు. వర్షాలు సరిగా పడకపోవడంతో పంట దిగుబడి బాగా తగ్గిపోయింది. ఎకరాకు 1, 2 బస్తాలు మాత్రమే కావడంతో పెట్టిన పెట్టుబడి కూడా రాలేదు. మామూలుగా ఎకరాకు 5 నుంచి 7 బస్తాలు అయ్యేవి. దీంతో కొందరు రైతులు పంటను పొలాల్లో వదిలేయలేక శనగ పొట్టు మేతకైనా ఉపయోగపడుతుందని పంట నూర్పిళ్లు చేశామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్వింటా రూ.5,800 నుంచి..

శనగ పంటకు ప్రస్తుతం ధర కూడా అంతంత మాత్రమే ఉంది. కింటా 6 వేలు మాత్రమే ధర ఉండటంతో కౌలు రైతుల పరిస్థితి అధ్వానంగా తయారైంది. ఎకరాకు కౌలు రూ.8వేల నుంచి 10 వేల వరకు ఉండటంతో అప్పులు తెచ్చి కౌలు చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు. పంట సాగు చేసి నష్టపోయిన రైతులందరికీ ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



ఈ ఏడాది పదును కాకపోయిన వర్షం వస్తుందని ఆశతో శనగపంటను 3 ఎకరాలలో సాగు చేశా.. దాదాపు రూ.45 వేలు ఖర్చు పెట్టాను. ఎకరాకు రెండు బస్తా శనగలు మాత్రమే అయ్యాయి. 45 వేలు శనగ సాగుకు ఖర్చు పెడితే రూ.36 వేలు మాత్రమే వస్తోంది. ఇలాగైతే రైతులు బతికేదెలా.. కౌలు రైతుల పరిస్థితి అధ్వాన్నంగా మారింది. ప్రభుత్వం శనగ రైతులను ఆదుకోవాలి.

\- తాటి సుబ్బరాయుడు, రైతు,



శనగపంట నూర్పిడి చేస్తున్న మిషన్



శనగలను సంచులలో నింపుతున్న రైతులు

గుర్తు తెలియని వాహనం ఢీ... మాజీ సర్పంచ్ దుర్మరణం



గురుభాస్కర్ మృతదేహం

జమ్మలమడుగు, ఫిబ్రవరి 6: జమ్మలమడుగు-ప్రొద్దుటూరు రోడ్డులోని బైపా స్ వద్ద మంగళవారం తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్ పోతనబోయిన గురుభాస్కర్ మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. జమ్మలమడుగు మండలంలోని గండికోట గ్రామానికి చెందిన గురుభాస్కర్ ప్రస్తుతం పట్టణంలోని ట్యాంకు వీధిలో నివశిస్తున్నాడు. మంగళవారం తెల్లవారుజామున తన ద్విచక్ర వాహనంలో పని నిమిత్తం ప్రొద్దుటూరుకు బయల్దేరి వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అక్కడున్న వారు గమనించి వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి వెళ్లి బోరున విలపించారు. మృతదేహాన్ని జమ్మలమడుగు ప్రభుత్వాఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడు గురుభాస్కర్ గండికోట గ్రామ సర్పంచ్‌గా 2013-2018 వరకు కొనసాగినట్లు బంధువులు తెలిపారు. ఈయనకు భార్య మహేశ్వరి, ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రూ.45 లక్షలు నగదు పట్టివేత



పట్టుబడిన నగదును చూపుతున్న పోలీసులు

గోపవరం, ఫిబ్రవరి 6: గోపవరం పీపీ కుంట చెక్‌పోస్టు వద్ద మంగళవారం పోలీసులు తనిఖీలు నిర్వహించి రూ.45లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఎటువంటి ఆధారాలు లేకుండా డబ్బులు తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో బద్వేలు రూరల్ సీఐ విక్రంసింహ, ఎస్ఐ రవికుమార్‌లు తమ సిబ్బందితో తనిఖీలు చేపట్టారు. నెల్లూరు నుంచి బద్వేలుకు వస్తున్న ఆర్టీసీ బస్సులో బద్వేలు పట్టణానికి చెందిన నరసింహ అనే వ్యక్తి వద్ద ఉన్న రూ.45 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. నగదుకు సంబంధించి ఎటువంటి ఆధారాలు చూప కపోవడంతో అతన్ని అరెస్టు చేశారు. పట్టుబడిన నగదును ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులకు అప్పగిస్తామని మైదుకూరు డీఎస్పీ వంశీధర్‌గౌడ్ తెలిపారు.

కొండాపురం మండలంలో రూ. 19.70 లక్షలు...



సీజ్ చేసిన నగదుతో కొండాపురం ఎస్ఐ యోగీంద్ర, సిబ్బంది

కొండాపురం, ఫిబ్రవరివరి 22: మండలంలోని జిల్లా ముచ్చుమర్రి పునరావాస కేంద్రం వద్ద మంగళవారం సాయింత్రం పోలీసులు రూ.10,00,000 లక్షల నగదు సీజ్ చేశారు. కొండాపురం ఎస్ఐ యోగీంద్ర ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ఈనగదును స్వాధీనపరచుకున్నారు. అనంతపురం నుంచి జమ్మలమడుగుకు కారులో వెళుతుండగా రమేష్‌కుమార్ అనే వ్యక్తి నుంచి ఈ మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా సుగుమంచిపల్లె చెక్‌పోస్టు వద్ద తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీలు నిర్వహిస్తుండగా ప్రొద్దుటూరు నుంచి హైదరాబాద్‌కు కారులో నగదు తీసుకెళుతున్న ఆసీష్ ఖైతన్ అనే వ్యక్తి నుంచి రూ.9,50,000లు స్వాధీనం చేసుకున్నారు. ఈ నగదుకు సంబంధించిన సరైన ఆధారాలు చూపకపోవడంతో నగదును సీజ్ చేసినట్లు తెలిపారు.

విద్యుత్ కంచె తగిలి వ్యక్తి మృతి కేసులో నిందితుల అరెస్టు



నిందితులను చూపుతున్న పోలీసు సిబ్బంది

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 4: మండల పరిధిలోని కొర్లకుంట చెరువు పరిధిలో పొలానికి తీసిన విద్యుత్ కంచె తగిలి వ్యక్తి మృతి చెందిన విషయం విదితమే.. కోడూరు మండలం బొజ్జవారిపల్లె పంచాయతీ బంగ్లామిట్టకు చెందిన తుపాకుల సుబ్రహ్మణ్యం అలియాస్ ఛత్రపతి (35) వేటకు వచ్చి.. కొర్లకుంట చెరువు పరిస రాలలో అడవి జంతువుల వేట కోసం అక్రమంగా తీసిన విద్యుత్ కంచె తగిలి మృతి చెందాడు. ఈకేసులో నిందితులైన అనంతరాజుపేట పంచాయతీకి చెందిన సుధాకర్, లక్ష్మయ్య, రమయ్య, గంగాధర్‌లను మంగళవారం సాయంత్రం అరెస్టు చేసినట్లు సీఐ మధుసూదనరెడ్డి, ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. వీరి వద్ద నుంచి విద్యుత్ వైరు, మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్య

పెద్దముడియం, ఫిబ్రవరి 6: మండల పరిధిలోని బోడితిప్పనపాడు గ్రామంలో మంగళవారం ఉలసాల వెంకటసుబ్బయ్య అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చోటు చేసుకుంది. బంధువులు, గ్రామస్థుల వివరాల మేరకు.. కుటుంబ అవసరాల కోసం అప్పులు చేసిన వెంకటసుబ్బయ్య అప్పులు తీర్చేమార్గం లేకపోవడంతో శివారులో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన బంధువులు పెద్దముడియం పోలీసులకు సమాచారం అందించారు. బంధువుల ఫిర్యాదు మేరకు పెద్దముడియం పోలీసులు కేసు నమోదు చేశారు.

బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలి

- ఏపీ పీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు



సమావేశంలో మాట్లాడుతున్న దామోదరరావు

బద్వేలు, ఫిబ్రవరి 6: ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను తక్షణమే చెల్లించాలని ఏపీ పీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.దామోదరరావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎన్‌జీవోహోంలో ఏపీపీడీఎఫ్ ఎంప్లాయీస్ యూనియన్ బద్వేలు డిపో నాయకత్వంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం అయిన తర్వాత ఉద్యోగ హక్కుల కోసం నిరంతరం రాజీలేని పోరాటాలు చేసిన ఏకైక అసోసియేషన్ ఎంప్లాయీస్ యూని యన్ అన్నారు. ప్రభుత్వంలో విలీనం జరిగిన తర్వాత కొన్ని నష్టాలు జరిగినప్పటికీ.. లాభాలు కూడా ఉన్నాయని.. ఉద్యోగులు ఈవిషయాన్ని గమనించాలన్నారు. ఉద్యోగులకు జీతభత్యాలు, ఇంక్రిమెంట్లు, పనిభారం విషయంలో ఉద్యోగుల పక్షాన నిలబడి ప్రభుత్వంతో చర్చించి న్యాయం జరిగేలా ముందుకు పోతున్నామన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన 71,72 జీవోలు ఉద్యోగులను ఇబ్బంది పెట్టేలా ఉన్నాయని.. మేనేజింగ్ డైరెక్టర్ ఇచ్చిన హామీని పక్కనపెట్టేలా అధికారులు ప్రవర్తిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. గత ఎండీ ఇచ్చిన జీఓనే అమలు చేసి ఉద్యోగులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు బోసుబాబు, మూర్తిలు మాట్లాడుతూ జిల్లాలో తగ్గించిన సర్వీసులను, పనిష్మెంట్ల విషయాలపై జిల్లా అధికారులు దృష్టిసారించి వారి సర్వీసులను పునరుద్ధరించాలన్నారు. మహిళా విభాగం జిల్లా కార్యదర్శి విజయమ్మ మాట్లాడుతూ మహిళా ఉద్యోగులకు సంబంధించి ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తామన్నారు. అనంతరం వైఎస్సార్ ట్రేడ్ యూనియన్‌కు సంబంధించిన కార్మికులు, ఎంప్లాయీస్ యూనియన్‌లో చేరారు. కార్యక్రమంలో రీజనల్ కమిటీ మెంబర్ కృష్ణారెడ్డి, డిపో అధ్యక్ష, కార్యదర్శులు నరసింహ, కొండయ్య పాల్గొన్నారు.

పగటిపూట వీధిలైట్లను ఆపకపోతే చర్యలు తప్పవు

- జిల్లా విద్యుత్ శాఖాధికారి రమణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ రమణ

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 6: జిల్లాలోని పలు గ్రామాల్లో, పట్టణాల్లో వీధిలైట్లు పగటిపూట కూడా వెలుగుతున్నాయని... వెంటనే చర్య లు తీసుకోకపోతే చర్యలు తప్పవని జిల్లా విద్యుత్ శాఖాధికారి రమణ అధికారులకు హెచ్చరికలు జారీ చేశారు. మంగళవారం ఆయన ఎర్రగుంట్ల, వీరపునాయునిపల్లె, కమలాపురం మండలాల విద్యుత్ కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యవారుపల్లె, 33/11 సబ్‌స్టేషన్‌ను, పాలగిరిలోని ట్రాన్స్‌ఫార్మర్లను తనిఖీ చేసినట్లు తెలిపారు. ఎక్కడైనా పగటిపూట వీధిలైట్లు వెలుగుతున్నాయని నా దృష్టికి వస్తే ఇకపై ఊరుకోనన్నారు. ఒక్క యూనిట్ విద్యుత్ కూడా వృధా కాకూడదన్నారు.

రానున్న వేసవి కాలంలో నాణ్య మైన విద్యుత్తు అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసు కుంటున్నట్లు తెలిపారు. అవసరమైన చోట కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అంతరాయాలు అధికంగా ఉన్నా యని... నిర్లక్ష్యంవీడి లైన్ల వెంబడి తిరగాలన్నారు. లైన్లకు, ట్రాన్స్‌ఫార్మర్స్‌కు అడ్డుగా ఉన్న కొమ్మలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. రైతుల విద్యుత్ సమస్యలపై సత్వరం స్పందించా లన్నారు. వినియోగదారుడు విద్యుత్ సమస్యలపై వచ్చినప్పుడు మర్యాద పూర్వకంగా స్పందించాలన్నారు. విద్యుత్ చౌర్యాన్ని అరికట్టేందుకు వెంటనే చర్యలకు ఉపక్రమించాలన్నారు. భద్రత నియమాలు పాటించని సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసులరెడ్డి, సబ్‌డివిజన్ డీఈఈ కిరణ్, విద్యుత్ రెవెన్యూ అధికారి రాధమ్మ, ఏఈలు సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి ఉపయోగపడే సివిల్ సర్వీసెస్ కావాలి

- సివిల్స్ మెంటార్ బాలలత



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న బాలలత

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 6: సమాజానికి ఉపయోగపడే సివిల్ సర్వీసెస్ కావాలని సివిల్స్ మెంటార్ బాలలత పేర్కొన్నారు. రైల్వేకోడూరులోని విజయ కన్వెన్షన్ హాలులో మంగళ వారం ప్రైవేటు పాఠశాలల ఆధ్వర్యంలో పది పరీక్షలకు విద్యార్థులు ఎలా సిద్ధం కావాలనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులు పరీక్షలు ఎలా రాయాలి, తమ లక్ష్యాలను ఎలా చేరాలనే అంశా లపై అవగాహన కల్పించారు. ఏయే గ్రూపులు తీసుకోవాలి, ఎలా ప్రిపేర్ కావాలి, ఎంత సమయం కేటాయించాలి, బుక్కులు ఎలా చదవాలి తదితర అంశాలపై క్షుణ్ణంగా విద్యార్థులకు తెలిపారు. చదువు అంటే బీటెక్, ఎంబీబీఎస్ కాదని... సమాజానికి ఉపయోగపడే సివిల్ సర్వీసెస్ కావాలని తెలిపారు. మన మేధస్సు వేరే దేశాలకు వెళ్లిపోకూడదన్నారు. మన జీవితంలో కొంత మందికైనా సేవ చేయాలని వివరించారు. నా జీవితం పిల్లలకు ఒక పాఠం కావాలన్నారు. పిల్లలకు అన్ని అవయయాలు ఉండి సక్రంగా చదవటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ రోజుల్లో నేను ఒక ఆడ బిడ్డ అయి ఉండి రెండు కాళ్లు పని చేయకపోయినా.. ఏస్కూల్లో చదవకపోయినా.. జీవితంలో సమాజానికి ఏదో ఒకటి చేయాలని.. అందరూ నా గురించి మాట్లాడుకునేలా సివిల్ సర్వీసెస్‌లో అత్యుత్తమ ర్యాంకు సాధించి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలో ఉద్యోగం సాధించానన్నారు. అలాగే హైద్రాబాద్‌లో సివిల్స్ కోచింగ్ సెంటర్‌ను స్థాపించి వందల మందిని కలెక్టర్లు, ఎస్పీలు, ఆర్డీవోలుగా ఎంపికయ్యేలా శిక్షణ ఇచ్చానని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి పురు షోత్తం, ఎంఈవో సుందర్‌బాబు, ప్రైవేటు పాఠశాలల యూనియన్ ఉపాధ్యక్షుడు విక్టరీ నరసింహారెడ్డి, జిల్లా కార్యదర్శి రాజశేఖర్, నియోజకవర్గ ప్రెసిడెంట్ ఎంవీ కుమార్, ప్రైవేటు పాఠశాలల అధినేతలు కంచిరాజు చెంగల్ రాజు, ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జంతు నమూనాలతో పరిశోధనలు సాగించాలి

- వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్



మాట్లాడుతున్న వైస్ చాన్సలర్ చింతా సుధాకర్

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 6: మానవ వ్యాధుల అధ్యయన పరిశోధనలో జంతువుల స్థానంలో వాటి నమూనాలను వినియోగించాలని వైవీయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ స్పష్టం చేశారు. జంతువులను ఉపయోగించేటప్పుడు 3 ఆర్ (రీప్లేస్‌మెంటు, తగ్గింపు, శుద్ధీకరణ) వ్యూహాన్ని నొక్కిచెప్పారు. మానవ వ్యాధుల అధ్యయనం కోసం జంతు నమూనాలు, నైతిక విలువలు, ప్రత్యామ్నాయ మార్గాలు అనే అంశంపై జరిగిన సెమినార్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కంప్యూటరు ప్రోగ్రాంలు పెరగుతున్న నేపథ్యంలో మానవ శరీరంలోని కొన్ని అంశాలను మోడల్ చేయగల సామర్థ్యం గతంలో కంటే సులభంగా మారిందన్నారు. ఆ మోడళ్లను ఉపయోగించి జంతువులకు ప్రత్యామ్నాయంగా పరిశోధనలు చేయాలన్నారు. గత కొన్నేళ్లుగా క్లినికల్, బయో మెడికల్ పరిశోధనల్లో జంతు పరీక్ష నమూనాలను భర్తీ చేయడానికి అనేక ప్రత్యామ్నాయ పద్ధతులు అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. సెల్ ఆధారిత పరీక్షలు, మైక్రోఫ్లూయిడ్ చిప్స్ కణజాల నమూనాలు, కంప్యూటర్ నమూనాలు, మానవశరీర దాతలు, మానవకణ, కణజాల ఆధారిత పరీక్షల ద్వారా పరిశోధనలు చేయవచ్చన్నారు. 20 ఏళ్ల కిందటే ఇంటర్మీడియట్ విద్యలో ప్రయోగాల కోసం జంతువులను నిషేధించారని తెలిపారు. అనంతరం రిజిస్ట్రార్ వైపీ వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి, సెమినార్ కన్వీనర్ ఎన్.వెంకట సుబ్బు రామిరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో సభ్యులు వెంకటరమణ, అనుపమన్న, వెంకటరమణారెడ్డి, ఏఎస్ మనోజ్, మనస్సి పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వంద మద్యం బాటిళ్లు స్వాధీనం

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 6: రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్‌కాలనీ చెక్ పోస్టు వద్ద వాహనాల తనిఖీల్లో 100 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని.. ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. మిట్టావాండ్లపల్లెకు చెందిన రాజా అనే వ్యక్తి మద్యం బాటిళ్లు తీసుకెళుతుండగా పట్టుబడ్డాడని, వాటిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రాజా ప్రభుత్వ మద్యం దుకాణంలో పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలియజేశారు.

జీఎన్ఎస్ఎస్ స్పెషల్ కలెక్టర్‌గా కౌసర్‌బాను

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 6: గాలేరు నగరి సుజల స్రవంతి ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్‌గా కడప జిల్లా స్పెషల్ కలెక్టర్ కౌసర్‌బానును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ డాక్టర్ జవహర్ రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈమె కడప జీఎన్ఎస్ఎస్ యూనిట్-2 డిప్యూటీ కలెక్టర్‌గా (కడప)పని చేస్తూ అదే శాఖకు స్పెషల్ కలెక్టర్‌గా పదోన్నతిపై విధులు నిర్వహించనున్నారు.

వృద్ధురాలిపై జాలిచూపని సచివాలయ సిబ్బంది



తిప్పలూరు సచివాలయం వద్ద కదల్లేని స్థితిలో ఉన్న మరియమ్మ

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 6: కదల్లేని స్థితిలో ఉన్న ఓ వృద్ధురాలిపై కనీసం దయచూపకుండా, నిర్లక్ష్యంగా వ్యవహరించిన సంఘటన మండలంలోని తిప్పలూరు సచివాలయం వద్ద మంగళవారం చోటు చేసుకుంది. వృద్ధురాలి కుమారుడు శ్రీను వివరాల మేరకు.... నా తల్లి మరియమ్మకు 1.5 సెంట్ల స్థలాన్ని రెండేళ్లక్రితం ఇచ్చారు. జగనన్న స్థలం రిజిస్ట్రేషన్‌కు నేడు చివరి తేదీ అని వలంటీర్ సువర్ణ ఫోన్ ద్వారా తెలపడంతో మా అమ్మను అతికష్టం మీద సచివాలయానికి తీసుకెళ్లాం. మా తల్లి ఆరోగ్య పరిస్థితి బాగా లేదని.. వెంటనే రిజిస్ట్రేషన్ చేయాలని ఆపరేటర్‌ను అడిగితే... వీఆర్‌వో లేనిది మేమేం చేయలేమంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. వీఆర్‌వోకు ఫోన్ చేయగా.. ఎర్రగుంట్ల తహసీల్దార్ కార్యాలయంలో ఉన్నానని చెప్పడంతో అక్కడికి వెళ్లి ఫోన్ చేయగా ఫోన్ ఎత్తలేదు. మళ్లీ సచివాలయానికి వచ్చి.. ఆరోగ్యం సరిగాలేదన్నా పట్టించుకోరా... అని ప్రశ్నించడంతో సచివాలయ సిబ్బంది వాగ్వాదానికి దిగారు. ఇంతలో వీఆర్‌వో శారద అక్కడికి వచ్చి సర్వర్ పనిచేయడం లేదు. మేమేం చేయాలంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తూ....సర్వర్ పని చేసినప్పుడు రావాలంటూ సమాధానం చెప్పిందని బాధితుడు పేర్కొన్నారు. జరిగిన సంఘటనపై వీఆర్‌వో శారద వివరణ ఇస్తూ... సచివాలయంలో సర్వర్ పనిచేయలేదు కాబట్టి రిజిస్ట్రేషన్ చేయలేకపోయాం. ఈ నెల 15వరకు గడువు ఉందని తెలిపారు.

నాయీ బ్రాహ్మణులకు అండగా టీడీపీ

● పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి,
● కడప ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 6 : నాయీ బ్రాహ్మణులకు అండగా టీడీపీ నిలుస్తుందని ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, కడప ఇన్‌చార్జ్ ఆర్. మాధవీరెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం కడప నగరం వీడీఆర్ హాలులో నాయీ బ్రాహ్మణుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో నాయీ బ్రాహ్మణులు టీడీపీలో చేరారు. టీడీపీ నేతలు వారికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ గెలుపు కోసం అందరూ కృషి చేయాలన్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చాక నాయీ బ్రాహ్మణులకు అండగా నిలుస్తుందన్నారు.జనసేన జిల్లా ఇన్‌చార్జ్ సుంకర శ్రీనివాస్, టీడీపీ నగర అధ్యక్షుడు శివకొండారెడ్డి, సురేష్, సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

11వ డివిజన్‌లో... కడప నగరం 11వ డివిజన్ అంబేడ్కర్ భవనం నుంచి బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ నిర్వహించారు. టీడీపీ కడప ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి, జనసేన జిల్లా ఇన్‌చార్జ్ సుంకర శ్రీనివాస్ పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించారు. అలాగే వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలిపి టీడీపీ అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీనివాసరాజు, నరేష్, శివ, శివకొండారెడ్డి, పార్వతి కార్యకర్తలు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన నాయీ బ్రాహ్మణులతో శ్రీనివాసరెడ్డి, మాధవీరెడ్డి, సుంకర శ్రీనివాస్ తదితరులు

టీడీపీలోకి 20 కుటుంబాలు

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 6 : చదిపిరాళ్ల పంచాయతీ రామచంద్రాపురానికి చెందిన 20 బీసీ కుటుంబాలు మంగళవారం టీడీపీలో చేరాయి.టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, మండల మాజీ ఉపాధ్యక్షుడు వాసుదేవరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శివమోహన్‌రెడ్డి పార్టీలోకి చేర్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే మేలన్నారు. పార్టీలో చేరిన వారికి తాను అండగా ఉంటానని పుత్తా పేర్కొన్నారు. చంటి, బాలరాజు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అధికారంలోకి వస్తే ఇంటింటికీ ఉచిత మంచినీరు : పుత్తా

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 6: వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి ఇంటికి ఉచిత మంచినీరు అందించడం జరుగుతుందని కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గొందిపల్లె పంచాయతీలోని నల్లయ్యగారిపల్లె, బాలయ్యగారిపల్లె, రామచంద్రాపురం, గొందిపల్లె, ఇందిరానాగర్ గ్రామాలలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పుత్తా నరసింహారెడ్డి, యువనాయకులు చైతన్యరెడ్డి, లక్ష్మిరెడ్డి, సాయినరసింహారెడ్డిలు హాజరై ఇంటింటికి తిరిగి చంద్రబాబు ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోని వివరించారు. తల్లికి వందనం, దీపం, ఆడబిడ్డ నిధి, బీసీ చట్టం తదితర ఎన్నో సంక్షేమ పథకాలు చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టడం జరుగుతుందని, వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గంగిరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి కిషోర్‌రెడ్డి, రాష్ట్రతెలుగు యువత కార్యదర్శి చంద్ర ఓబుల్‌రెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, చీమలపెంట సర్పంచు ప్రతాప్ రెడ్డి, టీడీపీనాయకులు శ్రీనాథ్‌రెడ్డి, వరదారెడ్డి, మోహన్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, సూర్యప్రతాప్‌రెడ్డి, రఘునాథరెడ్డి, సారథిరెడ్డి, ఆరవేటి చంద్రారెడ్డి, అయ్యవారురెడ్డి, ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పెండ్లిమర్రి మండలం గొందిపల్లెలో పార్టీలో చేరిన మోహన్‌రెడ్డి తదితరులు

110 కుటుంబాలు టీడీపీలో చేరిక

మండల పరిధిలోని గొందిపల్లె పంచాయతీలో మంగళవారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి సమక్షంలో 110 కుటుంబాలు టీడీపీలో చేరాయి. మంగళవారం బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ గ్రామ నేత మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నల్లయ్యగారిపల్లెలో విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో బాలయ్యగారిపల్లె, ఇందిరానగర్ గ్రామాలలో వైసీపీ నుంచి 110 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమన్నారు.

టీడీపీ యువనాయకులు పుత్తా చైతన్యరెడ్డి, లక్ష్మిరెడ్డి, సాయినరసింహారెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు గంగిరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి కిషోర్‌రెడ్డి, పార్టీనేతలు, శ్రీనాథరెడ్డి, అంబరీష్, వరదారెడ్డి, సూర్యప్రతాప్, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు పుత్తా సమక్షంలో టీడీపీలోకి చేరికలు

చెన్నూరు, ఫిబ్రవరి 6 : టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం చెన్నూరులో జనం భారీగా టీడీపీలో చేరనున్నారు. ఇందుకోసం చెన్నూరు రామాలయం వీధిలో అవసరమైన ఏర్పాట్లు చేశారు. వైసీపీ నేతలు పొట్టిపాటి హనుమాన్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, నేలటూరు రమణారెడ్డి ఆధ్వర్యంలో ఈ చేరికలు జరగనున్నాయి.

సమస్యలు పరిష్కారం కానప్పుడు సమావేశాలెందుకు?

● అధికారులు ఏం చేస్తున్నారు ● మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రజా ప్రతినిధుల ఆగ్రహం

చెన్నూరు, ఫిబ్రవరి 6: సమస్యలకు పరిష్కారం చూపనప్పుడు సమా వేశాలు ఎందుకు ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్ మాట్లాడుతూ సుమారు 9 సంవత్సరాల క్రితం హైవే రోడ్ల విస్తరణ కోసం ఇంటిస్థలాలు, నిర్మాణాలు పోగొట్టుకున్న వారికి అప్పట్లో అతి తక్కువ నష్టపరిహారం వచ్చిందని, దీంతో వారికి ఇంటిస్థలాలు ఇస్తామని చెప్పామన్నారు. అప్పటి నుంచి ఎంతో మంది తహసీల్దార్లు మారినా ప్రయోజనం లేదన్నారు. కొండపేటలో బియ్యం సక్రమంగా పంపిణీ చేయడం లేదని రోజూ ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయన్నారు. చెన్నూరు రామాలయం వీధిలో కొత్తగా కాలనీ ఏర్పాటైందని, ఆ ప్రాంతవాసులు త్రీఫేజ్ కరెంటు కోసం మీటర్లు ఇవ్వాలని మొత్తుకుంటున్నా కరెంటు అధికారులు ఏం చేస్తున్నారన్నారు. కొండపేటలో కొత్తగా పీహెచ్‌సీ భవనం కోసం నివేదికలు పంపించాలన్నారు. అలాగే చెన్నూరు, బుడ్డాయపల్లె, కొండపేటల్లో అంగన్వాడీ కేంద్రాలకు పైకప్పు లేదని, అది ఎప్పుడు వేస్తారని సమావేశంలో ప్రశ్నించారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ సమస్య లేకుండా చూడాలన్నారు. ఎంఈఓ గంగిరెడ్డి మాట్లాడుతూ డబ్బు రాకపోవడం వల్ల నాడు-నేడు పనులు ఆగిపోయాయన్నారు. ఉప్పరపల్లె ఎంపీటీసీ నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ ఇంటిస్థలాలు ఇచ్చారు, ఇంటి నిర్మాణం కోసం లబ్ధిదారులు రూ.35వేలు డబ్బు చెల్లించినా వారికి రిజిస్ట్రేషన్ చేసి ఇస్తారో లేదోననే అనుమానాలు వస్తున్నాయన్నారు. రుద్రభారతిపేటలో ఇంటిస్థలాల దొంగలు ఉన్నారని, వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కొండపేట ఎంపీటీసీ సభ్యుడు నాగిరెడ్డి మాట్లాడుతూ గ్రామ సబ్ సెంటరులో కరెంటు లేదని, వైద్యం ఎలా చేస్తారని ప్రశ్నించారు. కోఆప్షన్ సభ్యుడు వారిష్ మా ట్లాడుతూ చెన్నూరు మైనార్టీ ప్రాంతంలోని పాఠశాలల్లో ఉపాధ్యాయులు పిల్లలను ఇష్టమొచ్చినట్లు కొడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కొండపేట సర్పంచ్ తుంగా చంద్రయాదవ్ మాట్లాడుతూ గ్రామ జడ్పీ హైస్కూలులో నాటిన మొక్కలు ఏమయ్యాయని ప్రశ్నించారు. శివాలపల్లె సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ తాగునీటి మోటార్లకు విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తే ఆ వైర్లను దొంగిలిస్తున్నారని, మేము ఏమన్నా కట్టె పట్టుకుని కాపలా ఉండాలా అని ప్రశ్నించారు. జొన్న సాగులో ఉందని మరో తడి నీరు ఇవ్వకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. కేసీ అధికారులు జిల్లా అధికారులకు విషయం తెలపాలని కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినోద్ మాట్లాడుతూ టెండరు పనులు కావడం లేదని, ఎన్నికల కోడ్ వస్తే ఇక పనులు జరగవన్నారు. కేసీ కెనాల్ ఏఈ మాట్లాడుతూ తుంగభద్ర నుంచి నీరు రావడంలేదని, గండికోటకు నీరు కావాలంటే ఉన్నతాధికారులను అడగాల్సిందేనన్నారు. ఈఓఆర్‌డీ సురేష్‌బాబు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో ట్యాక్స్ లు పెంచుకోవాల్సిన బాధ్యత సర్పంచ్‌ల పైనే ఉందని, కలెక్టరుకు పంపి ఆయన ఆమోదంతో ప్రస్తుతం ఉన్న పనులపై అదనంగా 5 లేదా 10 శాతం పెంచుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో డిప్యూటీ తహసీల్దారు వెంకటరమణ, మండల ఉపాధ్యక్షుడు ఆర్.సుబ్బారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు అల్లె శ్రీరామ్మూర్తి, వైద్యాధికారి చెన్నారెడ్డి, వ్యవసాయాధికారి శ్రీదేవి, ఏపీఎం, ఏపీఓలు శైలజ, గంగాధర్, ఐసీడీఎస్ సూపర్‌వైజరు రమాదేవి, అటవీ శాఖ డైరెక్టరు శ్రీలక్ష్మి, హౌసింగ్ ఏఈ, పశువైద్యాధికారి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్

ఘనంగా రాహుకాల పూజలు

కడప (కల్చరల్), ఫిబ్రవరి 6: కడప నగరం బిల్టప్ సమీపంలోని విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం రాహుకాల పూజలు ఘనంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి పలువురు మహిళలు ఆలయానికి చేరుకుని అమ్మవారి సన్నిధిలో నిమ్మకాయలతో కూడిన రాహుకాల దీపాలను వెలిగించి తమ భక్తిని చాటుకున్నారు. చల్లని తల్లి విజయదుర్గాదేవి ఆశీస్సులు పొందారు.



ప్రత్యేక అలంకరణలో విజయదుర్గాదేవి... అమ్మవారి ఆలయంలో రాహుకాల దీపాలను వెలిగిస్తున్న మహిళలు

వృత్తి నైపుణ్య కోర్సులు ప్రయోజనకరం

పులివెందుల రూరల్, జనవరి 6: ఉద్యోగ, ఉపాధి అవకాశాలు త్వరగా లభించేందుకు వృత్తి నైపుణ్య కోర్సులు ప్రయోజనకరంగా ఉంటాయని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (మెయిన్) ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనివాసులరెడ్డి విద్యార్థులకు సూచంచారు. ఒకేషనల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా పులివెందులలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్)ని మంగళవారం సందర్శించారు. వృత్తి విద్య ఉపాధ్యాయులు కె.శ్రీనివాసులు, జి.అనంతకుమార్, ఉపాధ్యాయులు రామగంగిరెడ్డి, రామనాథరెడ్డి పాల్గొన్నారు.

విధుల పట్ల అలసత్వం వహిస్తే సహించేది లేదు: కమిషనర్

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 6 : విధుల పట్ల అలసత్వం వహిస్తే సహించేది లేదని సచివాలయ సిబ్బందికి కమిషనరు ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. మంగళవారం ప్రకాశ్‌నగర్ సచివాలయంతో పాటు మరికొన్ని సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. అడ్మిన్‌లు సెక్రటీరలు, అమ్యూనిటీ సెక్రటరీలు విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పన్ను వసూళ్లు పెండింగులో లేకుండా సెక్రటరీలు చర్యలు తీసుకోవాలన్నారు.

మెగా డీఎస్సీనా.. ఎలక్షన్ డీఎస్సీనా: ఏబీవీపీ

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 6 : రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టులను భర్తీకి మెగా డీఎస్సీ అంటూ ఎలక్షన్ డీఎస్సీని విడుదల చేసిందని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోడూరు మల్లిఖార్జున ఆరోపించారు. మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో కడప నగరం డీఎస్సీ శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులతో వారు మాట్లాడారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో 30వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, మన ప్రభుత్వం వచ్చిన వెంటనే భర్తీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ ఐదుసంవత్స రాలైనా ఒక్క డీఎస్సీ కూడా విడుదల చేయలేదన్నారు. ఇప్పుడు ఎన్నికలు వస్తున్నాయని ఆదరా బాదరాగా 6100 పోస్టులు భర్తీ చేస్తామనడం సిగ్గుచేటన్నారు.

'ఎన్నికల్లో అలజడి సృష్టించడం మానుకోవాలి'

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 6: త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో అలజడి సృష్టించే ఎత్తుగడలను మానుకోవాలని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు విష్ణుప్రీతం రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కడప నియోజకవర్గంలో 15 సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరగగా ఏనాడూ రాజకీయ నాయకులు వ్యక్తి గత విమర్శలకు దిగలేదన్నారు. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. నాయకుల పోస్టర్లు, బ్యానర్లు చించడం లాంటి చర్యలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయన్నారు. నగర ఉపాధ్యక్షుడు మధురెడ్డి, పాశం హరి, మామిళ్లబాబు, లావణ్య, సులోచన, వెంకటసుబ్బమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నగర అధ్యక్షుడు విష్ణుప్రీతం రెడ్డి

ఇళ్ల రిజిస్ట్రేషన్లను వేగవంతం చేయాలి

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 6: నవరత్నాల్లో భాగంగా పేదల ఇళ్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని కడప తహసీల్దారు శివప్రసాద్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కడప నియోజ వర్గ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను, హౌస్ సైట్ రిజిస్ట్రేషన్లను సచివాలయాల వారీగా పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ప్రధానంగా తాగునీరు, మరుగుదొడ్డు, ర్యాంపు, లైట్, ఫ్యాన్, ఇంటర్నెట్ మొదలగు సౌకర్యాలను పరిశీలించారు.

ఎన్నికలొస్తున్నాయ్... అప్రమత్తంగా ఉండండి : సీఐలు

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 6:త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని పులివెందుల అర్బన్ సీఐ శంకర్‌రెడ్డి, రూరల్ సీఐ బాలమద్దిలేటి సిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో పులివెందుల డివిజన్ పరిధిలోని పోలీస్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎక్కడా ఘర్షణ వాతావరణం లేకుండా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు గ్రామాల పరిస్థితులపై సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అరుణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐలు శంకర్‌రెడ్డి, బాలమద్దిలేటి

పులివెందుల అర్బన్ సీఐగా శంకర్‌రెడ్డి

పులివెందుల అర్బన్ సీఐగా శంకర్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన యాడికిసర్కిల్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తూ బదిలీలో భాగంగా పులివెందులకు వచ్చారు.

తరగతి గదిలోనే వ్యక్తిత్వ వికాసం ఆరంభం

● స్టెప్ ముఖ్య కార్యనిర్వహణాధికారిణి సాయిగ్రేస్

కడప (నాగరాజుపేట), ఫిబ్రవరి 6: వ్యక్తిత్వ వికాసం అనేది తరగతి గదిలోనే ఆరంభం అవుతుందని, అది దేశ భవిష్యత్తుకు కూడా దోహదపడుతుందని స్టెప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి సాయిగ్రేస్ పేర్కొన్నారు. మంగళవారం యువజన సర్వీసుల శాఖ కమిషనర్, విజయవాడ వారి ఆదేశాను సారం సీకేదిన్నె మం డలం కొలుములపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసంలో, సామాజిక అభివృద్ధిలో విద్య పాత్ర మహోన్నతమైనదన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ వ్యక్తిత్వం అనేది ఒక వ్యక్తి వాస్తవ పరిస్థితుల పట్ల ప్రదర్శించే ప్రవర్తన ద్వారా వర్గీకరించబడుతుందన్నారు.రాబోయే పరిస్థితులను ముం దుగానే అంచనా వేసి ఎవరూ చెప్పకుండానే ఏదైనా ప్రారంభించగల సామర్థ్యాన్ని ప్రొ యాక్టివ్ అంటారన్నారు. సీకేదిన్నె మండల విద్యాధికారిణి బి.రమాదేవి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో ఆలోచనా శక్తి మెరుగుపడుతుందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాసులు, స్టెప్ మేనేజరు సుబ్బరాయుడు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సాయిగ్రేస్

'హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం'

కడప (సెవెన్‌రోడ్స్), ఫిబ్రవరి 6 : హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని మున్సిపల్ కార్మిక సంఘం నగర కమిటీ అధ్యక్షుడు సుంకర రవి, జిల్లా కమిటీ సహాయ కార్యదర్శి కంచుపాటి తిరుపాలు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం వారు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సం దర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలకు సంబంధించి వెంటనే జీఓలు విడుదల చేయాలన్నారు. డ్రైవర్లకు రూ.24,500, పారిశుధ్య కార్మికులకు రూ.21వేలు, క్లాప్, ఆటో డ్రైవర్లకు రూ.18500, అలాగే కోవిడ్- 19 కార్మికులను ఆప్కాస్‌లో చేర్చడం, ఇంజనీరింగ్ సెక్షన్‌లో వారికి జీఓ ప్రకారం వేతనాలు ఇవ్వడం, టెక్నికల్, నాన్ టెక్నికల్, స్కిల్, సెమీ స్కిల్డ్ ప్రకారం వేతనాలు చెల్లించడం తదితర హామీలు ఇచ్చి సమ్మెను విరమింపజేశా రన్నారు. సమ్మె విరమించి దాదాపుగా నెల కావస్తున్నా ప్రభుత్వం నుంచి ఎటువంటి జీఓలు విడుదల కాలేదన్నారు. ఇది కార్మికుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిద ర్శనమన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను నెర వేర్చుకునేందుకు కార్మికులంతా సిద్ధమని వారు హెచ్చరించారు. సుంకర కిరణ్, ఆదామ్, సాయి, పెంచలయ్య, రొడ్డ ఆదాము, దస్తగిరమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

అక్షరాస్యతతో ఆర్థిక స్థితి మెరుగు

చెన్నూరు, ఫిబ్రవరి 6: విద్యావంతులు ఉన్న ఇంట్లో ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుందని కడప కోటిరెడ్డి మహిళా కళాశాల ప్రిన్సిపాల్ సలీంబాషా అన్నారు. జాతీయ సేవా సమితి ఆరవ రోజు కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని రామనపల్లెలో అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. మొదట గ్రామ వ్యాప్తంగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో ర్యాలీ నిర్వహించి అనంతరం ఇంటింటికీ వెళ్లి చదువు విలువపై వివరించారు. తల్లిదండ్రులు తమ బిడ్డలను పాఠశాలలకు క్రమం తప్పకుండా పంపించాలని, తద్వారా అక్షరజ్ఞానం పొంది భవిష్యత్తులో వారు మంచి స్థాయికి వెళ్లే మార్గం ఏర్పడుతుందన్నారు. నిర్ణీత వయసులోనే వివాహాలు చేయాలని, తక్కువ వయసులో పెళ్లి చేస్తే అనర్థాలు, ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు.గ్రామంలో అక్షరాస్యత 60 శాతం మాత్రమే ఉండటం బా .దాకరమన్నారు. ప్రతి ఇంటిలో చదువుకునేవారు పూర్తి స్థాయిలో ఉండాలని సూ చించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటరు డాక్టర్ విజయలక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

బీఎల్ఓలు అప్రమత్తంగా ఉండాలి

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 6: ఓటర్ల జాబితాలో చనిపోయన వారిపేర్లు తొలగించకపోవడం, డబుల్ ఎంట్రీలపై బీఎల్ఓలు అప్రమత్తంగా ఉండాలని, లేకుంటే చర్యలు తప్పవని తహసీల్దార్ వెంకటరమేష్ బాబు హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని పోలింగ్ బూత్‌లను ఎన్నికల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కొక్క పోలింగ్ కేంద్రంలో ఎన్ని ఓట్లు ఉన్నాయి. మృతిచెందిన వారు, డబుల్ ఎంట్రీలు ఎన్ని ఉన్నాయో ఇంటికి వెళ్లి పరిశీలించిన అనంతరం నివేదిక అందజేయాలన్నారు. ఇందులో రాజకీయ జోక్యం తగదన్నారు. తప్పులు జరిగితే అందుకు బీఎల్ఓలను బాధ్యులుగా చేరుస్తామన్నారు. విధులు సక్రమంగా నిర్వహించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఆయా పోలింగ్ స్టేషన్‌లో ఎంతమంది ఓటర్లు ఉన్నారో తెలుసుకున్నారు. ఎన్నికల డీటీ జగదీష్, ఎన్నికల ఆర్ఐ, సిబ్బంది, బీఎల్ఓలు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటరమేష్ బాబు


రోడ్డు, కాల్వల నిర్మాణంలో నాణ్యతాప్రమాణాలు పాటించాలి

● ఆర్అండ్‌బీ క్వాలిటీ సీఈ వెంకటేశ్ రావు

వేంపల్లె, ఫిబ్రవరి 6: వేంపల్లె పట్టణంలో సిమెంటు రోడ్డు, సైడ్ కాల్వల నిర్మాణ పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని రోడ్డు భవనాల శాఖ చీఫ్ ఇంజనీర్ వెంకటేశ్వర్‌రావు సూచించారు. పట్టణంలో సుమారురూ.35 కోట్ల వ్యవయంతో నిర్మిస్తున్న సిమెంటు రోడ్డు, సైడుకాల్వ నిర్మాణ పనులను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. కడప పులివెందుల రోడ్డులో జరుగుతున్న ఈ పనుల నాణ్యతను పరీక్షించారు. సుమారు రూ.5కోట్ల మేర పనులు జరిగాయని, ఇంజనీరింగ్ అధికారులు సీఈకి వివరించారు. పనులు వేగవంతంగా, నాణ్యవంతంగా చేయించాలని అధికారులను సూచించారు. ఎస్ఈలు శివకుమార్, మహేశ్వర్‌రెడ్డి, ఈఈలు సిద్దారెడ్డి, గీతారాణి, డీఈ, జేఈ పాల్గొన్నారు.

టీఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడిగా అమీర్‌బాషా

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 6: టీడీపీ అనుబంధ విభాగం టీఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడుగా రాగిపేట అమీర్‌బాష నియామకమయ్యారు. ఈ మేరకు మంగళవారం జిల్లా అధ్యక్షుడు లింగారెడ్డి అమీర్‌బాషకు నియామకపత్రం అందించారు. ఈ సందర్భంగా అమీర్‌బాష మాట్లాడుతూ తనకు అవకాశం ఇచ్చిన పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవికి, జిల్లా అధ్యక్షుడు లింగారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



నియామకపత్రం అందిస్తున్న లింగారెడ్డి

40 మద్యం బాటిళ్లు పట్టివేత

వల్లూరు, ఫిబ్రవరి 6 : కడప - తాడిపత్రి హైవేపై మంగళవారం 40 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. తనకు సమాచారం రావడంతో దాడులు నిర్వహించి 40 మద్యం బాటిళ్లతో సహా ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రేపు లింగమయ్యస్వామి తిరుణాళ్ల

కొండాపురం, ఫిబ్రవరి 6 :మండలంలోని చౌటిపల్లె గ్రామంలో గురువారం లింగమయ్య స్వామి తిరుణాళ్ల జరగనుంది.ప్రతి ఏటా పుష్యమాసం చివరి గురువారం ఇక్కడ తిరుణాళ్ల జరుగుతుంది.ఈ సందర్భంగా లింగమయ్యస్వామితో పాటు, గ్రామదేవత పెద్దమ్మతల్లికి బోణాలను సమర్పించి భక్తులు మొక్కుబడులను తీర్చుకుంటారు. ఈ తిరుణాళ్లకు జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తారు.చౌటిపల్లె గ్రామం గండికోట ప్రాజెక్టు క్రింద ముంపునకు గురి కావడంతో గ్రామస్థులు మండలంలోని గండ్లూరు,ముద్దనూరు మండలంలోని కమ్మవారిపల్లె వద్ద పునరావసం క్రింద ఇళ్లు నిర్మించుకున్నారు. ఈ రెండు చోట్ల లింగమయ్య స్వామిని ప్రతిష్ఠించారు.రెండు చోట్లా తిరుణాళ్లను నిర్వహిస్తున్నారు.

డీఎస్సీ అభ్యర్థులను మోసం చేసిన రాష్ట్ర ప్రభుత్వం

బద్వేలు రూరల్, ఫిబ్రవరి 6 : మెగా డీఎస్సీ పేరుతో డీఎస్సీ అభ్యర్థులను రాష్ట్ర ప్రభుత్వం నయా మోసం చేసిందని తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జహంగీర్‌బాషా ఆరోపించారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో తెలుగుయువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ నాలుగున్నర సంవత్సరాలుగా డీఎస్సీ అభ్యర్థులను మోసగిస్తూ వచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కేవలం 6100 డీఎస్సీ పోస్టులు మాత్రమే భర్తీ చేస్తానని ప్రకటించడం సరికాదన్నారు. ఇప్పటికే మెగా డీఎస్సీ కోసం తెలుగు యువత రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన నిర్వహించడం జరిగిందన్నారు. మెగా డీఎస్సీ కోసం ఎదురు చూస్తున్న ఉద్యోగులకు న్యాయం చేయని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాచుపల్లె వెంకటక్రిష్ణారెడ్డి, శివానందరెడ్డి, సంజీవయ్య, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

వేతనాల కోసం ఆర్టీపీపీలో రెండోరోజూ ధర్నా



ఆర్టీపీపీలో వేతనాల కోసం ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 6: జనవరి వేతనాల కోసం డాక్టర్ ఎంవీఆర్ ఆర్టీపీపీలోని ఉద్యోగులు మంగళవారం మెయిన్‌గేటు వద్ద ధర్నా నిర్వహిం చారు. ఉదయం 9గంటల నుంచి 10గంటల వరకు మెయిన్‌గేటు వద్ద ఉద్యోగ కార్మికులు బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, సంఘాల నాయకులు మాట్లాడుతూ వేతనాలకు ధర్నాలు చేస్తున్నా యాజమాన్యానికి చీమ కుట్టినట్లైనా లేదని విమర్శించారు. జీతాలు ఇచ్చేవరకు తాము ధర్నా కొనసాగిస్తామన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

బి.కోడూరు, ఫిబ్రవరి 6 : మండల పరిధిలోని మేకవారిపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల నిమిత్తం లోడ్ ప్రొవిజన్‌ను బట్టి పోరుమామిళ్ల, బి.కోడూరు, కాశినాయన, కలసపాడు మండలాల్లో విద్యుత్ సరఫరా ఉదయం 9గంటలనుంచి ఒంటి గంటలోపల ఎప్పుడైనా రెండుగంటలు నిలిపివేయడం జరుగుతుందని డీఈ చిన్నస్వామి నాయక్ తెలిపారు. విని యోగదారులు గమనించాలని వారు తెలిపారు.

బద్వేలు తహసీల్దారుగా మధుసూదనరావు

బద్వేలు, ఫిబ్రవరి 6: బద్వేలు తహసీల్దారుగా మదుసూధనరావు నియమితులయ్యారు. ఎన్నికల బదిలీల సందర్భంగా తిరుపతి జిల్లా, పిచ్చాటూరు మండలం నుంచి బదిలీపై బద్వేలుకు వచ్చారు. గతంలో తహసీల్దారుగా మధుసూదన్‌రెడ్డి సబ్ కలెక్టర్‌గా ప్రమోషన్‌పై చిత్తూరు జిల్లాకు వెళ్లారు.

బ్ర.మఠం... శివరామన్

బ్రహ్మంగారిమఠం, ఫిబ్రవరి 6 : బ్రహ్మంగారిమఠం తహసీల్దారుగా పి.శివరామన్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన చిత్తూరు జిల్లా నగిరి ఆర్డీవో కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వహిస్తూ బదిలీపై బ్రహ్మంగారిమఠానికి తహసీల్దారుగా వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న సువర్ణదేవి జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయానికి బదిలీ అయ్యారు.

టీడీపీని గెలిపించడంలో మహిళలదే కీలకపాత్ర







ఎర్రగుంట్ల...గోపులాపురంలో మినీ మేనిఫెస్టోను వివరిస్తున్న భూపేశ్‌రెడ్డి సతీమణి జ్యోతి, తల్లిసరస్వతమ్మ, ప్రొద్దుటూరు.. సూపర్ బజార్ నాగులకట్టవీధి ప్రచారంలో పాల్గొన్న మౌనికారెడ్డి, బద్వేలు... అబ్బుసాహెబ్‌పేట గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న బొజ్జ అరుణ, మాచుపల్లె లక్ష్మీదేవి

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 6: టీడీపీని గెలిపించడంలో మహిళలదే కీలకపాత్ర అని జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సి.భూపేష్‌రెడ్డి సతీమణి జ్యోతి, తల్లి సరస్వతమ్మ పేర్కొన్నారు. మంగళవారం చిన్నదండ్లూరు గ్రామ పంచాయతీలోని గోపులాపురం, మేకల బాలాయపల్లె, కొత్త గోపులాపురం గ్రామాల్లో బాబుష్యూరిటీ భవిషత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికీ తిరిగి టీడీపీ అధికారంలోకి వస్తే చేయబోయే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలను కరపత్రాల ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నల్లపురెడ్డి, సుధాకర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనివాసరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, ఎరుకలయ్య, పెద్ద ఎరుకలయ్య, రామకృష్ణారెడ్డి, గోపాల్, లక్ష్మీనారాయణరెడ్డి, వెంకటేష్, చిన్న వెంకటేష్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు..: బాబు ష్యూరిటీతోనే భవిష్యత్తుకు గ్యారెంటీ వుంటుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి సతీమణి మౌనికా రెడ్డి పేర్కొన్నారు.మంగళవారం సూపర్ బజార్‌వీధిలోని నాగకట్ట ప్రాంతంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మాజీ కౌన్సిలర్ తాటిశ్రీను, అధికార ప్రతినిధి ఆవుల దస్తగిరి, వార్డు ఇన్‌చార్జ్ శూలం ప్రసాద్, శూలం లక్ష్మీదేవి పాల్గొన్నారు.

బద్వేలు రూరల్..: చంద్రబాబు సీఎం అయితేనే తిరిగి రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని బొజ్జ అరుణ, తెలుగు మహిళా నియోకవర్గ అధ్యక్షురాలు మాచుపల్లె లక్ష్మీదేవి, పోరుమామిళ్ల మాజీ సర్పంచ్ హబీబున్నీసా పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని అబ్బుసాహెబ్‌పేట, బోయనపల్లె, బయనపల్లె గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బసిరెడ్డి రవికుమార్‌రెడ్డి, కేవీ సుబ్బారెడ్డి, వెంకటయ్య, వెంకటసుబ్బయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోకు సంబంధించి కరపత్రాలను బద్వేలు టీడీపీ ఇన్‌ఛార్జ్ బొజ్జ రోశన్న పంపిణీ చేశారు. మంగళవారం పోరుమామిళ్ల మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధిలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుగ్యారంటీలో భాగంగా ఎన్నికల మేనిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ యనమల సుధాకర్, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ చెరుకూరి చెన్నరాయుడు, టీడీపీ నాయకులు సీతా వెంకటసుబ్బయ్య, కల్వకూరి నడిపి వెంకటసుబ్బయ్య, ఇమాంఉసేన్,కల్వకూరి రమణ, పాప య్య, జిలానీ, రామసుబ్బారావు, సత్యరాజ్ పాల్గొన్నారు.



కలసపాడు... మహానందిపల్లె గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బొజ్జ రోశన్న

కలసపాడు..: మండలంలోని మహానందిపల్లె గ్రామంలో మంగళవారం బద్వేలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బొజ్జా రోశన్న బాబు భవిష్యత్తు గ్యారంటీ కరపత్రాలను పంచి ప్రచారం చేశారు కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, నాయకులు పట్టాభిరెడ్డి, భద్రయ్య, వెంకటరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రామక్రిష్ణ, దుగ్గిరెడ్డి, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

డెత్, డబుల్ ఎంట్రీలు తొలగించటంలో నిర్లక్ష్యం తగదు

● సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల వాదన

ప్రొద్దుటూరు , ఫిబ్రవరి 6 : ఫైనల్ ఓటరు జాబితా జనవరి 22న ప్రచురితమైనా డెత్‌లు, డబుల్ ఎంట్రీలు తొలగించటంలో నిర్లక్ష్యం ఎందుకు జరుగుతోందని రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రశ్నించారు. మంగలవారం సాయంత్రం తహసీల్దారు కార్యాలయంలో ఎన్నికల పార్టీ ప్రతినిధులతో ఈఆర్‌వో సమావేశం జరిపారు. ఈసందర్భంగా వారు ఫైనల్ లిస్టు తరువాత కూడా ఫాం7 ఎందుకు పెరుగుతున్నాయని ప్రశ్నించారు. ఇంకా బీఎల్‌వోలు క్షేత్ర స్థాయిలో వాటిని తొలగించే పనులు చేయకపోవడంతోనే ఈ పరిస్థితి ఉత్పన్నమౌతోందని తెలిపారు. ఇందుకు ఈఆర్‌వో చంద్రమోహన్‌స్పందిస్తూ ఫాం7 కేవలం 1649పెండింగ్ వున్నాయన్నారు. అలాగే ఫాం 6, 958 ఫాం 8 , 951 పెండింగ్‌లో వున్నట్లు తెలిపారు. వీటిని వెంటనే క్లియర్‌చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో తహసీల్దారు విద్యాసాగ్, కమిషనర్ మల్లికార్జున, ఎన్నికల డీటీ అజయ్‌బాబు, టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ, సీపీఎం, జనసేన పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్‌వో చంద్రమోహన్

భక్తివిశ్వాసాలు మనిషిని ఉన్నతీకరిస్తాయి

మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి



తిరుమల పాదయాత్రను ప్రారంభిస్తున్న వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు , ఫిబ్రవరి 6 : భక్తి విశ్వాసాలు అనేవి మనిషిని ఉన్నతీకరిస్తాయని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం టీటీడీ కళ్యాణ మండపం వద్దనుంచి కాంట్రాక్టర్ వంగల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో తిరుమల పాదయాత్ర చేపట్టారు. ఈపాదయాత్రనుమాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ప్రారంభించారు. భక్తులతో పాటు ప్రొద్దుటూరు పొలిమేరవరకు నడిచి భక్తులను సాగనంపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు నంద్యాల రాఘవరెడ్డి,లక్ష్మీపేట గురివిరెడ్డి,మాజీ జడ్పీటీసీ సభ్యుడు తోట మహేశ్వరరెడ్డి, ఆసం రఘురామిరెడ్డి, ఘంటశాల వెంకటేశ్వర్లు, నాగమునిరెడ్డి, రాజుపాళెం టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, రసూల్ గౌస్, మాజీకౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వం దివ్యాంగులను ఆదుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 6 : దివ్యాంగులను ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని ఆల్ ఆఫ్ యూ దివ్యాంగులు, వయోవృద్ధుల సొసైటీ అధ్యక్షుడు అఫ్జల్, గౌరవాధ్యక్షుడు చలపతిరావు, ఉపాధ్యక్షుడు ఖాజామొహిద్దీన్ తెలిపారు. మంగళవారం ముఖ్యమంత్రికి రాసిన లేఖను స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ 80 శాతంపైగా వైకల్యం కలిగిన దివ్యాంగులకు నెలకు రూ.10వేలు, అంతకంటే తక్కువ ఉన్న వారికి రూ.6వేలు పింఛన్ ఇవ్వాలని కోరారు. విద్యార్హత, వయసుతో సంబంధం లేకుండా 70 శాతం వైకల్యం కలిగిన వారందరికి మోటార్ త్రీవీలర్ వాహనాలను అందించాలన్నారు. దివ్యాంగ కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వాలని, అంత్యోదయ కార్డులు ఇవ్వాలని, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ నాయకులు అబ్దుల్ రషీద్, మహేష్, సూరయ్య, లక్ష్మీ, కొండమ్మ పాల్గొన్నారు.

వెల్లాలలో జగనన్న సురక్ష



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ మంజుల

రాజు పాలెం, ఫిబ్రవరి 6 : మండల పరిధిలోని వెల్లాల గ్రామంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. రాజుపాలెం పీహెచ్‌సీ డాక్టర్ మంజుల ఆధ్వర్యంలో రోగులను పరీక్షించారు. షుగరు, బీపీ తదితర వాటికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్ల జీవోను వెంటనే విడుదల చేయాలి

● మున్సిపల్ కార్మికులు, సీఐటీయూ డిమాండ్



జమ్మలమడుగు, ఫిబ్రవరి 6: జమ్మలమడుగులోని పాత బస్టాండు గాంధీ విగ్రహం వద్ద మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం సమ్మె కాలంలో ఒప్పుకున్న డిమాండ్ల జీవోలు వెంటనే విడుదల చేయాలన్నారు. కార్మికులు చేసిన 16 రోజుల సమ్మెలో భాగంగా చర్చల్లో ప్రభుత్వ పెద్దలు, మంత్రులు, ముఖ్య అధికారులు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. కార్మికులకు ఇచ్చిన హామీలు వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్, పట్టణ కార్యదర్శి దాసరి విజయ్, సీపీఎం కార్యదర్శి యేసుదాసు, మున్సిపల్ వర్కర్ల అధ్యక్ష, కార్యదర్శులు నాగన్న, శేఖర్, చెన్నయ్య, మైఖేల్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

రాజుపాలెం, ఫిబ్రవరి 6 : మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను సోమవారం ట్రైనీ డిప్యూటీ కలెక్టరు సాయి ప్రత్యూష, తహసీల్దారు విజయశ్రీ మంగళవారం పోలింగ్ బూత్ పరిశీలించారు. కొర్రపాడు, వాసుదేవపురం, ఉప్పలపాడు, గోపల్లె, కూలూరు, కొట్టాల, పర్లపాడు, అర్కటవేముల గ్రామాల్లోని పోలింగ్‌బూత్‌లను ట్రైనీ డిప్యూటీ కలెక్టరు పరిశీలించారు. వెలవలి, తొండలదిన్నె, టంగుటూరు గ్రామాల్లో తహసీల్దారు విజయశ్రీ పరిశీలించారు. పోలింగ్ బూత్‌లను సమస్యలు ఉన్నాయా లేవా అని సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.. కార్యక్రమంలో వీఆర్వోలు అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో టీడీపీలోకి 10కుటుంబాలు చేరిక



కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న భూపేశ్‌రెడ్డి

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 6: ఎర్రగుంట్లలో టీడీపీలోకి వలసలు భారీగా ఉంటాయని నియో జకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సి.భూపేశ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాత్రి ఎర్రగుంట్లనగర పంచాయతీ న్యూకాలనీకి చెందిన 10కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. చిట్టిబోయిన వెంకటరమణ, గణేష్, ఖాసీంపీరా,సురేంద్ర, సి.శ్రీను, హరి,వెంకటేష్, మున్నా,ఇమాం ఇంకా పలు కుటుంబాలకు భూపేశ్‌రెడ్డి టీడీపీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి సి.జయరామిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణా రెడ్డి, మేకల మోహన్‌రెడ్డి, సంజీవరెడ్డి, చాంద్‌బాషా, చిన్నసేట్, రమేష్‌రెడ్డి, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సబ్‌జైలులో న్యాయ విజ్ఞాన సదస్సు

బద్వేలు రూరల్, ఫిబ్రవరి 6 : స్థానిక సబ్‌జైలులో న్యాయవిజ్ఞాన సదస్సు సీనియర్ సివిల్ జడ్జి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఎస్. బాబా ఫకృద్దీన్ నిర్వహించారు. జైళ్లలో ఉన్న బాల నేరస్థులను గుర్తించి వారికి న్యాయ సహాయం అందించి వారిలో మార్పు తేవడం కోసమే పాన్ ఇండియా ప్రచార కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని వారు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం వారు మాట్లాడుతూ జైళ్లలో ఉన్న బాల నేరస్థులను గుర్తించి వారికి తగు న్యాయ సహాయం అందించడమే ఈ ప్రచారం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా మార్చి నెల 9న జరగబోయే జాతీయ లోక్ అదాలత్ జయప్రదం చేయాలని సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ బాబాఫకృద్దీన్ కోరారు. ఈ కార్యక్రమంలో మండల న్యాయ సేవా సమితి ఛైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి వైజే పద్మశ్రీ, జూనియర్ సివిల్ జడ్జి గాయత్రి, అసిస్టెంటు పబ్లిక్ ప్రాసిక్యూటరు ఉమాదేవి, బార్ ప్రెసిడెంట్ ప్రసాద్, పోలీసు అధికారులు, కోర్టు కానిస్టేబుళ్లు, న్యాయవాదులు పాల్గొన్నారు.

దిశ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి

బద్వేలు, ఫిబ్రవరి 6: వ్యవస్థలో సంపూర్ణ మార్పురావాలంటే దిశ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని బద్వేలు అర్బన్ ఎస్ఐ ఎం. సత్యనారాయణ పేర్కొన్నారు. బిజివేముల వీరారెడ్డి కళాశాల 1వ యూనిట్ ఆధ్వర్యంలో చిన్న కేశంపల్లె గ్రామంలో మంగళవారం స్పెషల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మహిళలపై సామాజిక మాధ్యమాలలో కామెంట్లుపెట్టినా వేధింపులకు గురిచేసినా సంబంధిత వ్యక్తి స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగానే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సమన్వయ కర్త దొరస్వామి నాయక్, ప్రధానోపాధ్యాయులు ఉమాకాంత్, కళాశాల అధ్యాపకులు హరినాథరెడ్డి, జీవి.రాఘవరెడ్డి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, ఈశ్వరయ్య, శ్రీనివాసులు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదంలో బాలుడి మృతి

గోపవరం, ఫిబ్రవరి 6 :మండల పరిధిలోని గోపవరం 1వ కాలనీకి చెందిన నల్లిపోగు మణికంఠ (14) అనే బాలుడు మంగళవారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. గాలిపటం ఎగురవేస్తుండగా ఆ పక్కనే ఉన్న విద్యుత్ వైరుపై గాలిపటం పడడంతో తీసుకునే ప్రయత్నంలో స్తంభం ఎక్కిన మణికంఠకు షాక్ తగలడంతో కింద పడ్డాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలిస్తుండగా దారి మధ్యలో మృతి చెందాడు.

జొన్న పంట పరిశీలన

అట్లూరు, ఫిబ్రవరి 6 : అట్లూరు మండలంలోని కమలకూరు, మన్నెంవారిపల్లె, మాడపూరు, కామసముద్రం, కుంభగిరి, తంబళ్లగొంది, కొండూరు గ్రామాల్లో మంగళవారం వ్యవసాయాధికారులు పర్యటించి జొన్నపంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ నాగరాజు సర్వేనెంబరు, ఖాతా నెంబరు, పంట రకం తదితర అంశాలపై ఆరా తీశారు. ఆయనవెంట రైతుభరోసా కేంద్ర సహాయకులు అనూష, సందీప్, దేవగుడి సందీప్, రామమోహన్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఎక్కడ..?

దళారులతో దగా పడుతున్న రైతులు

రాజుపాలెం, ఫిబ్రవరి 6 : ఆరుగాలం కష్టించే రైతన్నలకు తీవ్ర వర్షాభావంతో అరకొర పంటలే తప్ప పూర్తి పంటలు అందలేదు. దీనికి తోడు పంటకు సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో పాటు దిగుబడి తగ్గడంతో తెచ్చుకున్న అప్పుల వత్తిళ్లతో పండిన పంటలు దళారులకు అమ్మాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రభుత్వ మద్దతు ధర కొనుగోలు చేస్తామని చెప్పినా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కాకపోవంతో రైతులు లబోదిబోమంటున్నారు. మండల పరిధిలో సెప్టెంబరు మాసంలో సాగైన జొన్న పంట నూర్పిళ్ల దశకు చేరింది. అరకొర వర్షాలతో ఎకరాకు 8 నుంచి 12 క్వింటాళ్లు దిగుబడి వస్తుండడంతో రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా రాలేదని పేర్కొన్నారు. మండలంలో వివిధ గ్రామాల్లో 7500 ఎకరాల్లో ఈ పంట సాగు చేశారు. అయితే జోరుగా నూర్పిళ్లు జరుగుతున్న తరుణంలో క్వింటాకు దళారులు 2200 రూపాయలు చెల్లించడంతో పాటు ఒక క్వింటాకు 3 నుంచి 4 కేజీలు తరుగు తీసుకోవడంతో గత్యంతరం లేక రైతులు అమ్ముకుంటున్నారు. అసలే నష్టాలు ఆపై రేటు కూడా లేక రైతులు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం మద్దతు ధర రూ.3180 ప్రకటించడంతో పాటు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా కొంత మేర ఊరట వస్తుందని రైతులు తెలిపారు. అధికారులను ఎన్నిమార్లు అడిగినా ఇదో అదో అంటున్నారే తప్ప కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదంటున్నారు. ఇప్పటికైనా మండలస్థాయిలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి మద్దతు ధరకు జొన్నలు కొనుగోలు చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.



జొన్నలు నూర్పిళ్లు జరుగుతున్న దృశ్యం

